

విద్యా వనం.. ఎన్జీ కళాశాల
ఎంతో మంది మేధావులు, రచయితలు, కళాకారులను సమాజానికి అందించిన విద్యావనం ఎన్జీ కళాశాల.
- 8లో



వైజాగ్ కాలనీలో కార్డన్‌సెర్చ్
నేరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీలో ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	567.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	67,488 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	25,499 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	21,440 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	2,258
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

పారిశుద్ధ్య సామగ్రి సరఫరాకు టెండర్ల ఆహ్వానం

నల్లగొండ : జిల్లాలోని 868 గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు అవసరమయ్యే సామగ్రిని గ్రామ పంచాయతీలకు సరఫరా చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీల్డ్ టెండర్లను ఈ నెల 21న ఉదయం 11 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8074172060 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్ 1, కామర్స్ 2, బాటని 1, మైక్రోబయాలజీ 1, జువాలజీ 3, ఫిజిక్స్ 3, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ 6, హిందీ 1, తెలుగు 4, హిస్టరీ (ఉర్దూ) 1, పొలిటికల్ సైన్స్ (ఉర్దూ) 1 సబ్జెక్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు అభ్యర్థులు 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, ఈ నెల 22 నుంచి 25 వరకు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 98490 00244, 94409 12000 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు దొడ్డా నారాయణరావు సంతాప సభ

చిలుకూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు సంతాప సభ సోమవారం చిలుకూరులోని జరగనుందని సీపీఐ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దొడ్డా నారాయణరావు శిలాఫలకాన్ని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. ఈ సంతాప సభకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం ఎమ్మెల్యే కూనంనేని సాంశివరావు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లతో విజయ్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రైవేట్ టీచర్లుకు, లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫోరం (టీపీటీఎల్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తిరుమలగిరిలో ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలన్నారు. ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్లు కల్పించి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు నర్సింహారావు, మండల అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బండారి కిరణ్, కోశాధికారి దరావత్ భిక్షం, గౌరవ అధ్యక్షుడు పాలబిందెల శేఖర్, సహాయ కార్యదర్శి జి.వెంకన్న, బి.భిక్షం, వెంకన్న పాల్గొన్నారు.

చెరిగిపోతున్న చెరువు ఆనవాళ్లు!



చదును చేసి కబ్జా చేసిన పందిర్లపల్లి చెరువు

- కబ్జాకు గురవుతున్న చెరువు భూములు
- సాగు భూములను ప్లాట్లుగా మారుస్తున్న ఆక్రమణదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఉపాధి కోల్పోతామని మత్స్యకారుల ఆవేదన

మిర్యాలగూడ : కబ్జాదారుల చెరలో చిక్కి చెరువులు ఆనవాలు కోల్పోతున్నాయి. చెరువుల ఆక్రమణపై ఇటీవల కలెక్టర్ సమీక్షించి చెరువలు కబ్జాకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఫలితంగా చెరువు భూములు నివాస సముదాయాలు, వ్యవసాయ భూములుగా మారుతున్నాయి. చెరువులో నీరు తగ్గడమే తరువాయి కబ్జాదారులు అందులో మట్టిపోసి ఆక్రమించుకుంటున్నారు. దీంతో చెరువులపై ఆధారపడిన మత్స్యకారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిర్యాలగూడలో అధికంగా..

మిర్యాలగూడ నియోజకవర్గంలోని చెరువు భూములు ప్రస్తుతం కబ్జాకు గురవుతున్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని పందిర్లపల్లి చెరువు సర్వే నంబర్ 32లో, మిర్యాలగూడ శివారులోని సర్వే నంబర్ 118 కలుపుకుని సుమారు 480 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో ఇప్పటికే సగానికి పైగా కబ్జాకు గురైంది. ఈ విషయాన్ని గతంలోనే 'సాక్షి'వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారులు స్పందించి హద్దురాళ్లు ఏర్పాటు చేసి కబ్జా కాకుండా అడ్డుకున్నారు. ప్రస్తుత మళ్లీ ఆక్రమణకు తెరలేపారు. హద్దురాళ్లను తొలగించి చెరువు భూముల్లో మట్టి పోసి వ్యవసాయ భూమిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.

- మిర్యాలగూడ మండలంలోని రుద్రారం గ్రామంలోని రుద్రప్ప చెరువు సర్వే నంబర్ 117లో 310 ఎకరాలు ఉండగా అందులో 140 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గతంలో వెలుగులోకి వచ్చింది. మళ్లీ ఇప్పుడు కబ్జాకు గురవుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అక్రమాలకు తెరలేపారు ఇలా..

మిర్యాలగూడ పట్టణ పరిధిలోని పందిర్లపల్లి చెరువు పక్కన సర్వే నంబర్ 116, 117లో ఎకరన్నర పట్టా భూమి ఉండగా.. దానికే ఆనుకుని సర్వే నంబర్ 118లో 203.26 ఎకరాల చెరువు శిఖం ఉంది. దాంతోపాటు సర్వే నంబర్ 114లో 128.38ఎకరాల బంచరాయి భూములు ఉన్నాయి. ఆ భూమి అంతా కబ్జా గురైంది. అయితే చెరువు పక్కన పట్టా భూమి ఉన్న వారు ఆ భూమిని ఎప్పుడో అమ్మేసుకుని శిఖం, బంజరు భూములను కబ్జా చేస్తున్నారు. వీరంతా ధనవంతులు కావడం, అధికార అండ ఉండడంతో ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. పందిర్లపల్లి చెరువును సుందరీకరణ చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో బోటింగ్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే ఈ భూములను కబ్జా చేసేందుకు తెరలేపారు. బంజరు, శిఖం భూముల గుండా పోవాల్సిన నెక్లెస్ రోడ్డును మార్చేసి చెరువు సమీపం నుంచి తీయడంతో అక్రమార్కులకు కబ్జాకు అవకాశం దొరికింది.

కబ్జా నుంచి చెరువును కాపాడాలి

పందిర్లపల్లి చెరువుపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇప్పుడు చెరువులో నీళ్లు లేకపోవడంతో చెరువులో సమీపంలో ఉన్న భూములు కబ్జాకు గురవుతోంది. చెరువు విస్తీర్ణం తగ్గిపోయి మేము ఉపాధి కోల్పోతాము. చెరువు భూములను అధికారులు కాపాడాలి.

– గండెల శ్రీనివాస్, మత్స్యకార్మికుడు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం

చెరువు శిఖం భూముల కబ్జాపై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశాం. విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వివరించాం. అధికారులు స్పందించి పందిర్లపల్లి చెరువును పూర్తిగా సర్వే చేయించి హద్దులు నిర్ణయించి చెరువు భూములను కాపాడాలి.

– నక్క నరసింహ, మత్స్య కార్మికుడు

సమగ్ర సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం

మిర్యాలగూడ నియోజకవర్గంలో ఉన్న చెరువుల ఆక్రమణపై ఇప్పటికే ఆయా తహసీల్దార్లకు నివేదికను అందించాం. జీపీఎస్ విధానం ద్వారా సర్వే నిర్వహించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. ఆయా తహసీల్దార్లు సర్వేయర్లను చెరువుల వద్దకు పంపించి జీపీఎస్‌తో సర్వే నిర్వహించాలి. ఇప్పటికే మాడ్గులపల్లి మండలంలోని నల్లచెరువు, ఇందుగుల గ్రామంలోని చంద్రవంక చెరువు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశాం.

– జనార్దన్, ఐబీ డీఈ, మిర్యాలగూడ

అధికారుల అలసత్వం

సాగు, తాగునీటికి జీవనాధారంగా ఉన్న చెరువులు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అలసత్వం కారణంగా మత్స్యకారులు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. చెరువు ఆక్రమణపై కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందినా ఫలితం ఉండడం లేదు. అధికారుల కనుసన్నల్లోనే ఈ కబ్జాల పరంపరం కొనసాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువు భూముల కబ్జాలను అరికట్టాలని కోరుతున్నారు.

బోనాల సంబరం



బోనాల పండుగ సందర్భంగా ఆదివారం నందికొండలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించేందుకు డప్పు చప్పుళ్లతో వెళ్తున్న మహిళలు

యాదగిరి క్షేత్రంలో కోలాహలం



ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నృసింహుడి దర్శనానికి బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట: నిత్యారాధనలు, భక్తజనులతో ఆదివారం యాదగిరి క్షేత్రంలో కోలాహలం నెలకొంది. ప్రభాతవేళ స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. ఆ తరువాత గర్భాలయంలోని స్వయంభూలను నిజాభిషేకం, తులసీదళాలతో అర్చించారు. ఇక ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్య కల్యాణ వేడుక, బ్రహ్మోత్సవం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. అదే విధంగా ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, సాయంత్రం ఆలయంలో వెండి జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయ ద్వార బంధనం చేశారు.

మూసీకి 866 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి : ఎగువన వర్షాలు కురుస్తుండటంతో మూసీ ప్రాజెక్టుకు ఆదివారం ఇన్‌ఫ్లో పెరిగింది. శనివారం సాయంత్రం మూసీ రిజర్వాయర్‌కు 243 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారానికి 866 క్యూసెక్కులకు పెరిగింది. మూసీ ప్రాజెకు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 641.50 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పేర్కున్నారు. వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 231 క్యూసెక్కుల చొప్పున మొత్తం 462 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.57 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో ప్రారంభం కావడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ బడికి పూర్వ వైభవం

- 30 నుంచి 85కు చేరిన విద్యార్థుల సంఖ్య
- సత్ఫలితాన్నిచ్చిన ముందస్తు బడిబాట
- ఉపాధ్యాయులకు సహకరించిన గ్రామ యువత



నడికూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

గుర్రంపోడు : గతేడాది వెలవెలబోయిన గుర్రంపోడు మండలంలోని నడికూడ ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం విద్యార్థులతో కళకళలాడుతోంది. ఉపాధ్యాయుల అంకితభావం, పట్టుదలతో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు కాశం నారాయణరెడ్డి విధుల్లో చేరగానే విద్యార్థుల సంఖ్యను పెంచాలనే సంకల్పంతో తోటి ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, యువతతో కలిసి చర్చించారు. వేసవి సెలవులకు ముందే పెద్ద ఎత్తున ముందస్తు బడిబాట నిర్వహించి ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల ఇళ్లకు ఒకటికీ నాలుగుసార్లు వెళ్లి వారిని మెప్పించారు. గ్రామపెద్దలు, యువతను తీసుకుని వెళ్లి వారితో తమ ఊరి బడిలో తమ పిల్లలను చదివించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 85 మందికి చేరింది.

ఖాళీగా ప్రైవేట్ స్కూల్ బస్సులు

గతంలో ఈ గ్రామం నుంచి గుర్రంపోడు, కొప్పోలు, హాలియా, వెల్మగూడెం గ్రామాల ప్రైవేట్ పాఠశాలల బస్సులు నడిచేవి. గ్రామస్తులు, యువత ముందుగా ప్రైవేట్ బస్సుల్లో విద్యార్థులు వెళ్లకుండా నిలువరించారు. పిల్లలంతా గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలలో చేరేలా సహకరించారు. దీంతో ఆ పాఠశాల ప్రస్తుతం కొత్త కళను సంతరించుకుంది.

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడతాం



గత ఏడాది పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులందరికీ గురుకుల సీట్లు వచ్చేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. గ్రామంలో ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు రాని గురుకుల సీట్లు మా పాఠశాలకు రావడాన్ని తల్లిదండ్రులకు వివరించాం. ప్రైవేట్ విద్యార్థుల కంటె తమ పాఠశాల విద్యార్థులే బాగా చదువుతాని చాలెంజ్ చేశాం. తాము విద్యార్థులపై ఎలా శ్రద్ధ తీసుకుంటున్నామో వారు అర్థం చేసుకున్నారు. మా నమ్మకం ఉంచి పాఠశాలలో చేర్పించిన తల్లిందండ్రుల నమ్మకం నిలబెట్టేలా మరింత బాధ్యతతో పనిచేస్తున్నాం.

– కాశం నారాయణరెడ్డి, హెచ్‌ఎం

పేదప్రజలకు అండగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ

సూర్యాపేట అర్బన్ : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సమాజంలో పేద ప్రజలు, బాధితులకు అండగా ఉంటుందని ఆ కౌన్సిల్ రాష్ట్ర ఇన్‌చార్జి చింతపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీసి వ్యవస్థాపకుడు డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వైజాగ్ కేంద్రంగా ఏర్పాటై దేశంలో 14 రాష్ట్రాల్లో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా సాధికారతే లక్ష్యంగా కౌన్సిల్ పనిచేయనుందన్నారు.

కాల్వకట్టలు కబ్జామయం!



ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ



పాలెం–నోముల గ్రామాల మధ్య కబ్జాకు గురైన డీ–53 కాల్వ కట్ట

- కాల్వ దారులను పొలంలో కలిపేసుకుంటున్న రైతులు
- ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వతోపాటు మైనర్ల కట్టలూ ఆక్రమణ
- కాల్వల వెంట దారిలేకుండా చేస్తున్న వైనం
- కాల్వ భూములను కాపాడాలని కలెక్టర్‌కు రైతుల వినతి
- పాలెంలో ఆక్రమణలు గుర్తించిన అధికారులు

నకిరేకల్: మండల పరిధిలోని ఎస్ఎల్‌బీసీ (ఏఎమ్మార్పీ) కాల్వలు కబ్జాకు గురవుతున్నాయి. కాల్వలకు ఇరువైపులా భూమిని ఆక్రమించుకుంటున్న కొందరు రైతులు తమ పట్టా భూముల్లో కలుపుకుంటూ కాల్వ గట్టు వెంట ఎగువ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికి దారిలేకుండా చేస్తున్నారు. నకిరేకల్ మండలం పాలెం గ్రామంలో పాలెం–నోముల వైపు ఉన్న డీ–53 కాల్వకు ఇరువైపులా ఉన్న భూములను ఆక్రమణకు గురయ్యాయని వాటిని కాపాడాలని ఇటీవల గ్రామానికి చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన అధికారులు విచారణ చేయగా కాల్వ భూములు ఆక్రమణకు గురైనట్టుగా నిర్ధారించడంతో కబ్జాల పర్వం వెలుగులోకి వచ్చింది.

కాల్వల నిర్మాణం ఇలా..

జిల్లాలో 136 కిలోమీటర్ల పొడవు ప్రవహించే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు నకిరేకల్ మండలం చివరిగా ఉంది. నల్లగొండ మున్సిపల్ పరిధిలోని పానగల్ ఉదయ సముద్రం నుంచి నకిరేకల్ మండలం నడిగూడెం వద్ద ఉన్న మూసీ రిజర్వాయర్‌లో ఈ ఏఎమ్మార్పీ కాల్వ కలుస్తుంది. ఈ కాల్వ పరిధిలో నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల్లో మొత్తం 30వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. డీ–40 నుంచి చివరి డిస్ట్రిబ్యూటరీ డీ–55వరకు మొత్తం 16 డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఈ నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించాలనే లక్ష్యంతో ఈ కాల్వ నిర్మించారు. ఈ కాల్వ పరిధిలోని చెరువులు, కుంటలను నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో సమృద్ధిగా నీరు లభిస్తుంది.

ఆనవాళ్లు కోల్పోతున్న మైనర్లు

25 ఏళ్ల క్రితం ఏఎమ్మార్పీ కాల్వలను తవ్వారు. అప్పట్లో కాల్వల కోసం అధికారులు పెద్ద ఎత్తున భూసేకరణ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం కూడా చెల్లించారు. పానగల్ ఉదయ సముద్రం నుంచి కట్టంగూర్ మండలం అయిటిపాముల చెరువు మీదుగా నకిరేకల్ మండలం సరిహద్దులో ఉన్న మూసీ రిజర్వాయర్ వరకు నకిరేకల్, కట్టంగూర్ మండలాల్లో వంద కిలోమీటర్లపైనే కాల్వలు విస్తరించి ఉన్నాయి. ప్రధాన కాల్వతో పాటు సమీపంలోని చెరువులు, కుంటలు నింపేందుకు మైనర్ కాల్వలు నిర్మించారు. అయితే ప్రధాన కాల్వ పక్కన భూములతోపాటు, మైనర్ కాల్వలకు ఇరువైపులా ఉన్న రైతులు కాల్వల భూములను ఆక్రమించారు. నకిరేకల్ మండలం పాలెం, కేతేపల్లి మండలం గుడివాడ చెరువుకు నీరు తీసుకెళ్లే డీ–53 కాల్వకు ఇరువైపులా భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటూ ఆనవాళ్లు లేకుండా చేశారు. ఫలితంగా దిగువన ఉన్న చెరువులు, కుంటల్లో నీటి సరఫరాకు ఆటంకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి



మా పాలెం గ్రామంలోని ఊరకుంటలోకి డీ–53 కాల్వ నుంచి నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం చెరువులోకి వచ్చే కాల్వ కబ్జాకు గురైంది. కాల్వ ఆనవాళ్లు లేకుండా పోయింది. కాల్వ భూములు ఆక్రమణకు గురికాకుండా అధికారులు అడ్డుకట్ట వేఆయలి. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి.

నోముల కృష్ణయ్య, రైతు, పాలెం, నకిరేకల్ మండలం

కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు



పాలెం గ్రామంలో ఏఎమ్మార్పీ కాల్వను ఇరు వైపులా ఉన్న రైతులు కబ్జాకు పాల్పడినట్లు గుర్తించాం. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కాల్వ వెంట ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఏఎమ్మార్పీ కాల్వ భూములను ఆక్రమించే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతాం.

– పి.యాదగిరి, తహసీల్దార్, నకిరేకల్

యువతరం.. సాహిత్యంలో రాణించాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి

రామగిరి(నల్లగొండ) : యువతరం సాహిత్యంలో రాణించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో యువ కవి సమ్మేళనం, సాహిత్య సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజాన్ని అధ్యయనం చేయకుండా కవిత్వం రాయడం వల్ల సరైన కవిత్వం రాదన్నారు. యువత అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని సమాజాన్ని సంస్కరించడానికి తమవంతు కర్తవ్యం నిర్వహించాలన్నారు. కవి, రచయిత, మహబూబ్‌నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మహాప్రస్థానం పుస్తక పరిచయంపై మాట్లాడుతూ మహాప్రస్థానం యువకులకు లాంగ్ మార్చ్ లాంటిదన్నారు. అనంతరం కవి, రచయిత తెలంగాణ సాహితి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ హసేన రాసిన కవితా సంపుటి 'నువ్వే ఒక సమూహం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 30 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు, కవులు ఈ సభలో పాల్గొని కవితా పఠనం చేశారు. అనంతరం యువకవులకు జ్ఞాపిక, మహాప్రస్థానం పుస్తకాన్ని బహుకరించి సత్కరించారు. ఉత్తమ కవితలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, మట్టికవి డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ పగడాల నాగేందర్, డాక్టర్ సర్రా ప్రవీణ్‌రెడ్డి, బాల సాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి, పెరుమాళ్ల ఆనంద్, ఏభూషి నరసింహ, బైరెడ్డి కృష్ణారెడ్డి, మాదగాని శంకరయ్య, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, బీమార్జున్‌రెడ్డి, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బూర్గు గోపికృష్ణ, పుప్పాల మట్టయ్య, బండారు శంకర్, టి.ఉప్పలయ్య, పగిడిపాటి నరసింహ, గేర నరసింహ, ఆందోజు నాగభూషణం, దాసరి ప్రభాకర్, దాసరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తిరుమలగిరి (తుంగతుర్తి): బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం జరిగింది. వివరాలు.. అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామానికి చెందిన అంబటి రాములు(37) బైక్‌పై వెళ్తూ సూర్యాపేట-జనగామ హైవేపై తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని వశిష్ఠ పాఠశాల సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి అంబటి పవిత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుమలగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్ మెకానిక్ షాప్‌లోకి దూసుకెళ్లిన కారు



ధ్వంసమైన కారు

నాగారం: అతివేగంతో వచ్చిన కారు అదుపు తప్పి బైక్ మెకానిక్ షాప్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన ఆదివారం రాత్రి సూర్యాపేట-జనగామ రహదారిపై నాగారం(బంగ్లా) చౌరస్తాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి హన్మకొండకు వెళ్తున్న కారు నాగారం(బంగ్లా) చౌరస్తా వద్దకు రాగానే అతివేగంతో అదుపుతప్పి పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్‌ను ఢీకొట్టింది. అనంతరం కారు తన దిశను మార్చుకొని పక్కనే ఉన్న బైక్ మెకానిక్ షాప్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్ మెకానిక్ షెడ్డులో ఉన్న పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. రాత్రి సమయం కావడంతో షాప్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రామగిరి(నల్లగొండ): వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చందనపల్లి గ్రామానికి చెందిన రైతు అమరేందర్‌రెడ్డి(58) వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం తన పొలం వద్దకు వెళ్లాడు. బోరు మోటారు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశువులు

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువులను చౌటుప్పల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం పట్టణం నుంచి హైదరాబాద్‌లోని బహదూర్‌పూర్‌లో గల కబేళాకు లారీలో పశువులను తరలిస్తుండగా.. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద స్థానిక పోలీసులు పట్టుకున్నారు. లారీలో తరలిస్తున్న 18 ఆవులు, 17 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పశువులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి, లారీ డ్రైవర్ ఎండీ మోహినుద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యా వనం.. ఎన్జీ కళాశాల

కాలేజీ స్థాపించి 70 వసంతాలు

- ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత
- రేపు ప్లాటినం వేడుకలు
- మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం

ఎంతో మంది మేధావులు, రచయితలు, కళాకారులు, ప్రముఖులను సమాజానికి అందించిన విద్యావనం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ కాలేజీ). ఏడు దశాబ్దాలుగా ఎందరో జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా విద్యార్థి ఉద్యమాలకు, పోరాటాలకు నెలవుగా నిలిచింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది సమాజానికి అందిస్తున్న ఎన్జీ కళాశాల ప్రారంభమై 70 వసంతాలు అయిన నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.



నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ కాలేజీ) భవనం



1956లో ఎన్జీ కళాశాలను ప్రారంభిస్తున్న అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలో క్లాక్‌టవర్ సెంటర్‌కు సమీపంలో 1956 జులై 22న అప్పటి హైదరాబాద్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు నాగార్జున ప్రభుత్వ కళాశాలను (ఎన్జీ కాలేజీ)ని ప్రారంభించారు. అప్పటికి తెలంగాణాలో హైదరాబాద్‌లో నిజాం కళాశాలతో పాటు ఖమ్మం, సిద్దిపేట, కరీంనగర్‌లో మాత్రమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆచార్య నాగార్జునుడి స్ఫూర్తితో నాగార్జున విద్యాసమితి పేరున 29 ఎకరాల సువిశాల స్థలంలో ఈ కళాశాల ప్రారంభమైంది. ప్రారంభంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో 1989 వరకు ఈవినింగ్, డే కాలేజీ నడిచేది. ప్రస్తుతం 27 యూజీ కోర్సులు, 6 పీజీ కోర్సులు ఉన్నాయి. విద్యా బోధనతో పాటు ఎన్‌సీసీ శిక్షణ, ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు ఈ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. టాస్క్ సెంటర్ ద్వారా విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. ఎన్జీ కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా 183 దేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలు సాధించారు.

మొదటి అటానమస్ కళాశాల

ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో మొట్టమొదటి అటానమస్ కళాశాల ఇది. 2004 ఫిబ్రవరి 16న కళాశాలకు మొదటిసారిగా యూజీసీ న్యాక్-బి గుర్తింపు వచ్చింది. 2007-2008 విద్యా సంవత్సరం నుంచి స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా లభించింది. తద్వారా సిలబస్ రూపకల్పన, అకడమిక్ షెడ్యూల్, పరీక్షల నిర్వహణ తదితర విషయాల్లో కళాశాల స్వయంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ కళాశాలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్‌ఐ) సర్టిఫికెట్ కలిగి ఉంది. ప్రస్తుతం రూ.36కోట్లతో కళాశాల నూతన భవనం రూపుదిద్దుకుంటోంది. కాలేజీలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 4 వేలకు పైగానే ఉంది. కొత్తగా మూడు బ్లాక్‌లలో ఇప్పటికే ఒకటి పూర్తి కాగా మిగతా బ్లాక్‌లు నిర్మాణ దశలో ఉన్నాయి.



ఎన్జీ కళాశాలలోని సైన్స్ ల్యాబ్

ఉత్తమ బోధన అందిస్తున్నాం



కళాశాలలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన అందిస్తున్నాం. విశాలమైన తరగతి గదులు, సైన్స్ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం ఉంది. కళాశాల లైబ్రరీలో వేల పుస్తకాలు ఉన్నాయి. టాస్క్ సెంటర్ ద్వారా ఉద్యోగ నైపుణ్యాలు మెరుగుపర్చడం ద్వారా అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారు.

– డాక్టర్ ఎస్. ఉపేందర్, ప్రిన్సిపాల్

రేపు వ్యవస్థాపక దినోత్సవం

ఎన్జీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్లాటినం వేడుకలు నిర్వహించనున్నారు. ఇందు కోసం కళాశాల యాజమాన్యం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ వేడుకలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. అదేవిధంగా కళాశాల విద్య కమిషనరేట్ అధికారులు, కళాశాల పూర్వ విద్యార్థులు కూడా హాజరుకానున్నారు. ఈ వేడుకలో మెరిట్ సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నారు.

గ్రంథాలయంలో 62 వేలకు పైగా పుస్తకాలు

ఎన్జీ కళాశాలలోని గ్రంథాలయంలో కొన్ని వేల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. లైబ్రరీ అంతటా ఇంటర్నెట్ అనుసంధానమై ఉంది. ఇంత పెద్ద లైబ్రరీలో ఏ పుస్తకం ఎక్కడ ఉంటుందో కంప్యూటర్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం లైబ్రరీలో 62,794 పుస్తకాలతో పాటు వివిధ రకాల నేషనల్ ఇంటర్నేషనల్ జర్నల్స్, న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంటాయి.



లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులు

సీజ్ చేసిన వాహనాలను విడిపించుకెళ్లండి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: వివిధ నేరాల్లో, వాహనాల తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 166 ద్విచక్ర వాహనాలు సూర్యాపేట జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో ఉన్నాయని, సంబంధిత యజమానులు సరైన పత్రాలు చూపి వాటిని తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరునెలల గడువు లోగా ఆయా వాహనాల యజమానులు సరైన పత్రాలు సమర్పించి విడిపించుకోవాలని లేదంటే కాలం చెల్లిన వాహనాలను పాత సామానుకు, సామర్థ్యం ఉన్న వాహనాలను వేలం వేస్తామని తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ ఫేస్‌బుక్ పేజీలో, ఎక్స్(ట్విటర్)లో పొందురుస్తామని పేర్కొన్నారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి



గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వైజాగ్ కాలనీలో కార్డన్ సెర్చ్



ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలతో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

- ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను స్థానికులు నిర్బంధించినట్లు గుర్తించిన పోలీసులు
- పలువురికి విముక్తి

చందంపేట: దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీలో శనివారం అర్ధరాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వైజాక్ కాలనీకి చెందిన పలువురు మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన అమాయక కూలీలను పని కల్పిస్తాం అని ఇక్కడకు తీసుకొచ్చి వారికి వేతనం ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని, సొంత ప్రాంతానికి వెళ్లకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించి పలువురికి విముక్తి కల్పించినట్లు ఏఎస్పీ తెలిపారు. అదేవిధంగా సరైన పత్రాలు లేని 22 బైక్‌లు, 4 ఆటోలు సీజ్ చేసి, నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

యాదగిరిలో నృత్య ప్రదర్శన



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన మణి భార్గవి బృందం, హైదరాబాద్‌లోని సంకల్ప్ నృత్య వృక్ష వారిచే ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కల్వలపల్లిలో కూలిన ఇల్లు

మునుగోడు: రెండు రోజుల క్రితం వరకు కురిసిన చిన్నపాటి వర్షానికే మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామంలో ఓ మిద్దె ఇల్లు కూలింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వలపల్లి గ్రామానికి చెందిన కొండ నర్సింహ ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అతడికి కొత్త ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక కుటుంబ సభ్యులతో అందులోనే జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే రెండు రోజుల క్రితం వరకు ఓ మోస్తారు వర్షం కురవడంతో ఇల్లు తడిసిపోయి కూలింది. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు నర్సింహ వేడుకుంటున్నాడు.

ముగ్గురిపై పోక్సో కేసు

నడిగూడెం: నడిగూడెం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గంధమళ్ల అజయ్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడిపల్లికి చెందిన 24 ఏళ్ల యువకుడు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరాటే మాస్టర్‌కు జాతీయస్థాయి అవార్డు



సినీ నటుడు భానుచందర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న క్రాంతికుమార్

కోదాడరూరల్: కోదాడ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్ జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. ఆదివారం ఏపీలోని విజయవాడలో వైఎంకే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్టార్ కరాటే మాస్టర్ ఎంపిక పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి 16 మంది పాల్గొనగా సూర్యాపేట నుంచి క్రాంతికుమార్ పాల్గొని నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డును సినీ నటుడు భానుచందర్ చేతుల మీదుగా అందుకున్నారు. క్రాంతికుమార్‌ను కరాటే మాస్టర్లు, స్నేహితులు అభినందించారు.

గీత కార్మికుడికి గాయాలు

చండూరు: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు సిలముల క్రిష్ణయ్య ఆదివారం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వచ్చిన తన తమ్ముడి కొడుకు సిలుముల శివ చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే క్రిష్ణయ్యను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సంగెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలు

- రైతు పేరిట ఎక్కువ ధాన్యం బస్తాలకు ట్రక్ షీట్
- ఆ డబ్బులను తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న కొనుగోలు కేంద్రం సిబ్బంది

వలిగొండ: వలిగొండ మండలం సంగెం గ్రామంలో గత సీజన్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం గ్రామానికి చెందిన ఓ రైతు గత సీజన్‌లో తాను పండించిన ధాన్యాన్ని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలించగా.. తూకం వేసిన నిర్వాహకులు 1084 బస్తాల ధాన్యంగా లెక్కించి లారీలో లోడ్ చేయడానికి సిద్ధం చేశారు. సదరు రైతు పేరున 1084 బస్తాలకు ట్రక్ షీట్ ఇవ్వాల్సి ఉండగా... అదనంగా 450 బస్తాలు చేర్చి 1534 బస్తాలకు ట్రక్ షీట్ ఇవ్వడాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది గుర్తించి ట్రక్ షీట్‌లో అదనంగా చేర్చిన 450 బస్తాల ధాన్యం డబ్బులు రూ.4,75,000ను వారి సొంత బ్యాంక్ ఖాతాల్లోని మళ్లించుకున్నారు. అయితే 450 బస్తాల ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతు ఖాతాలో పడలేదని గుర్తించిన కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు ట్యాబ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తుండగా.. గ్రామానికి చెందిన ఓ రైతు పసిగట్టి ట్యాబ్ అసిస్టెంట్‌ను నిలదీశాడు. దీనికి ట్యాబ్ అసిస్టెంట్ స్పందిస్తూ.. కొనుగోలు సెంటర్ నిర్వాహకురాలు మిల్లు యజమానితో కుమ్మక్కై వేలాది బస్తాల ధాన్యం అక్రమాలకు పాల్పడితే అడిగేది లేదు గాని.. మమ్ములను మాత్రమే అడుగుతున్నావు అని చెప్పడంతో ఆ రైతు నిర్ఘాంతపోయాడు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అక్రమాలపై ఆ రైతు గ్రామస్తులకు తెలిపాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా.. ధాన్యం కొనుగోలు కేంద్రంలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంగెం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా నృసింహుడి నిత్య కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఎదుర్కోళ్ల మహోత్సవం అనంతరం కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ జరిపారు. అనంతరం మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, అంజనేయ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెరువులో వేసిన రోడ్డు తొలగింపు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల పరిధిలోని కామినేని ఆస్పత్రి ఎదురుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట ఏపీ లింగోటం, మాధవ ఎడవల్లి గ్రామాల మధ్యలో పెద్ద చెరువు కాలువను, ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 122లో రోడ్డును తొలగించి స్ప్రెక్ట్రా వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్‌కు వెళ్లేందుకు పెద్ద చెరువు కాలువలో ఏర్పాటు చేసిన రోడ్డును ఆదివారం జేసీబీ సహాయంతో తొలగించినట్లు ఆర్డీఓ అశోక్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట డీఈ పిచ్చయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ తరుణ్, సర్వేయర్ శ్రీనివాస్, ఐబీ ఏఈలు నవీన్, రమ, ప్రియా, రాజశేఖర్, ఏఎస్‌ఐ యాదగిరి ఉన్నారు.



చెరువు కాలువలో వేసిన రోడ్డును తొలగిస్తున్న అధికారులు

విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్గించేలా..

- మందనపల్లి ప్రాథమిక పాఠశాలను తీర్చిదిద్దిన హెచ్‌ఎం
- స్కూల్ గోడలపై పాఠ్యాంశాల్లోని చిత్రాలు, గుణింతాలు, ఆంగ్ల అక్షరాలతో పెయింటింగ్

ఆలేరురూరల్: ఆలేరు మండలం మందనపల్లి ప్రాథమిక పాఠశాలకు వచ్చే విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్గించేలా స్కూల్‌ను తీర్చిదిద్దారు. పాఠశాల హెచ్‌ఎం తన సొంత ఖర్చులతో ప్రతి తరగతి గదిలో పాఠ్యాంశాలలోని చిత్రాలను గీయించడంతో గోడలపై చిత్రాలు, గుణింతాలు, ఆంగ్ల పదాలు, రకరకాల బొమ్మలు పెయింటింగ్ చేయించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను అందించాలనే లక్ష్యంతో తనదైన శైలిలో పాఠాలు బోధిస్తున్నారు. గత ఏడాది 21 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 33కు పెంచారు.

ఆటపాటల ద్వారా విద్యాబోధన

హెచ్‌ఎం ఎండీ సయ్యద్ స్వయంగా చార్టులు రూపొందించి టీఎల్‌ఎం, ఆటపాటల ద్వారా బోధన చేస్తుండడంతో విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏరోజు చెప్పిన విషయాలు ఆ రోజు తరగతుల వారీగా ఆయా గ్రూప్‌లలో వేస్తారు. వెనుకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వాట్సాప్ గ్రూప్‌లో పంపిస్తారు. బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి కనుక్కుంటారు. యోగా మ్యాట్‌లను పంపిణీ చేసి ప్రతి శుక్రవారం విద్యార్థులకు యోగా నేర్పించడం, ప్రతి శనివారం పిల్లలకు ఆటలు ఆడించడం చేస్తున్నారు. పాఠశాలలో హెచ్‌ఎం సొంతంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి అందులో కథల పుస్తకాలు ఉంచారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, బాలల దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాల విశిష్టతను వివిధ యాక్టివిటీస్ ద్వారా తెలియజేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రతి ఏటా పాఠశాల వార్షికోత్సవం, సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల వైపు చూడకుండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. హెచ్‌ఎం ఎండీ సయ్యద్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి గుర్తించి స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించారు.



తరగతి గదిలో గోడలపై వేసిన చిత్రాలతో పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం ఎండీ సయ్యద్



పాఠశాల ఆవరణలో గోడలపై వివిధ రకాల చిత్రాలు, ఆంగ్ల పదాలు



పాఠశాల గోడలపై చిత్రాలు



ఆటపాటలతో పాఠాలు నేర్పిస్తున్న టీచర్